మన్యంవీరుడు అల్లూరికి ఘన నివాళి

పాలకోడేరు: దేశం కోసం, దేశ ప్రజల స్వాతంత్ర్య కోసం చిన్న వయసులోనే బ్రిటీష్ వాళ్లతో పోరాడి ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు తెలుగు బిడ్డ కావడం, మన ప్రాంతం వాడు కావడం, మన మండలం వాడు కావటం మనందరి అదృష్టమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు.అల్లూరి 99వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన మోగల్లు లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును స్ఫూర్తి గా తీసుకుని, ప్రతీ ఒక్కరు సమాజం గురించి, సమాజం లోని రుగ్మతల గురించి ఆలోచించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), ఎంపీటీసీ కాటూరి శాంతకుమారి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, నాయకులుమంతెన బాపిరాజు, పెన్మత్స నాగరామకృష్ణంరాజు, కలిదిండి గౌతమ్ రాజు చిల్లా రత్నరాజు , గోడి భూషణం, శివకోడు హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

కొణితివాడలో..

వీరవాసరం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. కొణితివాడలో అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయులకు బ్రిటిష్ వారి నుంచి స్వేచ్ఛ జీవనానికి, స్వాతంత్ర్య ఫలాలను పొందడానికి జీవితాన్ని ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి అని కీర్తించారు. కార్యక్రమంలో నాగరాజు వెంకట శ్రీనివాసరాజు యరకరాజు హరిబాబు, నాగరాజు వెంకట గోపాల కృష్ణంరాజు, యరక రాజు గోపాలకృష్ణంరాజు, నాగరాజు సత్యనారాయణ రాజు, కుచ్చర్లపాటి రవి పాల్గొన్నారు .

కాళ్లలో..

కాళ్ల: అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా జువ్వలపాలెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సీపీఎం పశ్చిమగోదావరి జిల్లా సెక్రటేరియట్ కమిటీ సభ్యులు జేఎన్వీ గోపాలం ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ అతి చిన్న వయసులో సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సీతారామరాజు చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో కాళ్ల మండల సీపీఎం కార్యదర్శి గొర్ల రామకృష్ణ, తిరుమాని శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

సాక్షి, భీమవరం: పోరాటయోధుడు, మన్యం వీరుడు, ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని ప్రస్తుతం యువత అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని ప్రజలకు మేలు జరిగే విధంగా నడుచుకోవాలని భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు పిలుపునిచ్చారు. అడ్డవంతెన వద్ద ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని అల్లూరి సీతారామరాజు యూత్ ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ నరసింహ రాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలకు అండగా ఉండి విప్లవ జ్యోతిగా మారారని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, కనకరాజు సూరి, క్షత్రియ యూత్ నాయకులు పి.వి.టి రాజు, అల్లూరి అజయ్ వర్మ ముదునూరి సుబ్బరాజు పెనుమత్స రాజకుమార్, దండు అరవింద్, బుద్ధరాజు శ్రీనివాసరాజు, నవీన్, శృంగవృక్షం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో

భీమవరం (ప్రకాశంచౌక్): అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. అల్లూరి స్మృతి వనంలోని 30 అడుగుల అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ సుబ్రహ్మణ్యంరాజు, ఉద్దరాజు వేణుగోపాలరాజు, చేకూరి ఝాన్సీలక్ష్మి, కె.వి సత్యనారాయణరాజు, ముదుండి సత్యనారాయణరాజు, కేవీ మాద్రాజు, వేగేశ్న రమణరాజు, చేకూరి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యమాల విధానాలకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు అని, నా దేశం, నా ప్రజలు పరాయి పాలనలో ఉండటం సిగ్గు చేటని విల్లంబులతో మన్యం ప్రాంతంలో ఉద్యమం సాగించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. నరసయ్య అగ్రహారంలోని అల్లూరి విగ్రహం వద్ద అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన్యం ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన అల్లూరి చిరస్మరణీయుడని అన్నారు. కార్యక్రమంలో యిందుకూరి సుబ్రహ్మణ్యం, కడలి వెంకటేశ్వరరావు, పత్సమట్ల సూర్యనారాయణ రాజు, తిప్పా ముత్యం, కే రాం ప్రసాద్, ముదునూరి సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపూసలమర్రులో

భీమవరం అర్బన్: మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్రపోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారామ్ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎం.సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యసమర యోధుడు అల్లూరి సీతారామరాజు మన జిల్లాలో జన్మించడం మనందరి అదృష్టం అన్నారు. కార్యక్రమంలో తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటిరాజు, నాగిడి జయ సుందరరావు, తిరుమాని శ్రీరాములు, తిరుమాని లక్ష్మీ నారాయణ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



మోగల్లులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



కొణితివాడలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



భీమవరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



నరసయ్య అగ్రహారంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



కొత్తపూసలమర్రులో మాట్లాడుతున్న ఎం.సీతారామ్

క్లుప్తంగా

గీతామందిర నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: స్థానిచెన్నకేశవస్వామి, మహిషాసురమర్దిని ఆలయ ప్రాంగణంలో ఆదివారం గీతామందిర పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.తమ్మిరాన రామన్న మహం కాళమ్మ కుటుంబికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అయినంపూడి రామకృష్ణంరాజు, సభ్యులు శేషాద్రి శ్రీను,మండా రత్నమాణిక్యం, మంతెన వెంకట్రాజు, సన్నిధిరాజు చలపతిరావు పాల్గొన్నారు.

వైభవంగా విజయేంద్ర సరస్వతి జయంతి



వేద పండితులకు రగ్గులు అందిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు

ఆకివీడు: వేదాలతోనే ప్రపంచ శాంతి లభిస్తుందని, వేద ఉచ్ఛరణతో గ్రహ దోషాల్ని పారద్రోల వచ్చునని ప్రముఖ సంస్కృత, వేద పండితులు గొడవర్తి సుందర రాజన్ చెప్పారు. కంచి కామకోటి ప్రథమ పీఠాధిపతి స్వర్గీయ చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్యులు జయంతి వేడుకలు మండలంలోని అయిభీమవరం గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులతో వేద పారాయణ చేశారు. టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు వేద పండితులకు రగ్గులు పంపిణీ చేశారు. గొల్లపల్లి శివశర్మ శ్రౌతి, లింగాల సత్యనారాయణమూర్తి, దుర్గా ప్రసాద్, పూర్ణ ప్రసాద్ సిద్ధాంతి, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, మోటుపల్లి గంగాధరరావు పాల్గొన్నారు.

త్వరలో సాయి ట్రస్ట్ సేవలు ప్రారంభం

ఆకివీడు: ఒడిస్సాకు చెందిన సాయి ట్రస్టు సేవల్ని త్వరలో ఉభయ గోదావరి జిల్లాలో ప్రారంభిస్తామని ట్రస్టు జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ పువ్వాడ రాజా అమర్‌నాథ్ చెప్పారు. స్థానికంగా ఆయన నివాసంలో ఆదివారం వలంటీర్లకు నియామక పత్రాలు, ఐడెంటిటీ కార్డుల్ని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను), కుంచాడ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

సాక్షి, భీమవరం: మహనీయుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని డీఎన్నార్ అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. దంతులూరి నారాయణరాజు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి, విశ్వకవి రావీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని డీఎన్నార్ కళాశాల ఆవరణలోని వీరి విగ్రహాలకు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణరాజు ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు సైతం అతితక్కువ ఫీజుతో విద్యావకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, కళాశాల పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డీఎన్నార్ కళాశాల ఆవరణలో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు/పాలకోడేరు/భీమవరం అర్బన్: వేమగిరి సబ్ స్టేషన్‌లో కొత్త పనుల నిమిత్తం 220 వేమగిరి–ఉండి ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయింత్రం 6 గంటల వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు, ఉండి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా రొటేషన్ బేసిస్‌లో లోడ్ రిలీఫ్ ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంలో, పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం, బంటుమిల్లి, విస్సాకోడేరు, మోగల్లు, కుముదవల్లి, పాలకోడేరు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా దంతులూరి నారాయణరాజు వర్ధంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ నాయకులు, కళాశాల వ్యవస్థాపకులు దంతులూరి నారాయణరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంలో దంతులూరి వీరోచిత పాత్ర వహించారని, 1945లో ఇంగ్లిష్ వారి పరిపాలనలోనే కళాశాల స్థాపించిన మహోన్నత వ్యక్తి దంతులూరి చిరస్మరణీయుడని అన్నారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి యిందుకూరి ప్రసాద్ రాజు, రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు పరిశీలన

ఉండి: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చాడాలనే ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల బృందం ఆదివారం మండలంలోని పలు రైస్ మిల్లులు, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించింది.దీ నిలో భాగంగా మండల ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారుల బృందం ఉండిలో రైస్ మిల్లును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఏఓ బి.సంధ్య, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, వీఆర్వో ఎస్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరేడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలమూరి కృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమం పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

వీరవాసరం/ఉండి: స్థానిక శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తామని వీరవాసరం గ్రంథపాలకులు బత్తుల హనుమంతరావు, ఉండిలో గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ వేరువేరుగా ఆదివారం విలేకరులకు తెలిపారు. మే 8 సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన డొల్ల ఆశ తన భర్త నర్సింహ, అత్త పద్మ, ఆడపడుచు తామరపల్లి లుదియా లు వేధిస్తున్నారని ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు. భర్త నర్సింహ తాగి వచ్చి ప్రతీ రోజూ కొడుతున్నట్లు, మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

పాలకోడేరు: మోగల్లు గ్రామంలో ఆదివారం గంగాదేవి జాతర నిర్వహించారు. డిసిసిబి చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలనికోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, మంతెన బాపిరాజు, నాగ రామకృష్ణ రాజు, ఎంపీటీసీ సభ్యురాలు కాటూరి శాంతకుమారి ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వీరవాసరం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 16 వరకు జరగనున్న స్టూడెంట్స్ ఫెస్ట్ ప్రచార పోస్టర్ను వీరవాసరం గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అప్పుడు మాత్రమే వారు భవిష్యత్‌లో మంచి లక్ష్యాలను సాధించగలరని అన్నారు. విద్యార్థులకు వేసవికాలంలో ఇటువంటి స్టూడెంట్స్ ఫెస్ట్‌ను ఎస్ఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ వీరవాసరం విద్యార్థులు,విద్యార్థులు,పెద్దలు మేధావులు, ప్రజానీకం ఈ ఫెస్ట్ ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు వి.బాలాజీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.